క్లుప్తంగా

క్రీడాకారులకు అభినందన



బేస్‌బాల్ క్రీడాకారులతో ఉపాధ్యాయులు

బంగారుపాళెం: బేస్‌బాల్ పోటీలలో ప్రతిభ చాటిన రాగిమానుపెంట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను బుధవారం ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్ఎం సుజాత మాట్లాడుతూ, గత నెల కాకినాడ డిగ్రీ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అంతర్ జిల్లాల బేస్‌బాల్ పోటీలలో తమ స్కూలు విద్యార్థులు సోనియా, అక్షయ, నేతాజీ, భరత్, యుగళ, చరిష్మ, కీర్తన రజత పతకాలు సాధించారన్నారు. వారితోపాటు పీఈటీ గురుప్రసాద్‌ను టీచర్లు అభినందించారు.

వరసిద్ధుని సేవలో వినుకొండ ఎమ్మెల్యే



వినుకొండ ఎమ్మెల్యేకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని పల్నాడు జిల్లా వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

త్వరితగతిన అభయ్ యాప్ సర్వే

చిత్తూరు అర్బన్: ఆరోగ్యశ్రీ, ప్రభుత్వ వైద్య సర్వీసుల సేవలకు సంబంధించి అభయ్ యాప్ సర్వేను ఏఎన్ఎంలు త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ హరినాథ్ రెడ్డి ఏఎన్ఎంలను ఆదేశించారు. ఆయన నగరపాలక ప్రజారోగ్య అధికారి డాక్టర్ లోకేష్‌తో కలిసి నగరంలోని సత్యనారాయణపురం, మురుకంబట్టు, కాజూరు అర్బన్ ఆరోగ్య కేంద్రాలను, దొడ్డిపల్లె, సాంబయ్యకండిగ వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. అర్బన్ ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి వైద్య సిబ్బందితో సమీక్షించారు. ఆరోగ్యశ్రీ సేవలు పొందిన లబ్ధిదారుల అభిప్రాయాలను అభయ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. క్లాప్స్ కార్యక్రమాల అమలు, యూజర్ చార్జీలపై డాక్టర్ లోకేష్ సమీక్షించారు. కార్యక్రమంలో ఏఎస్వో నరసింహ, వైద్యాధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

గుడిపాల: సచివాలయ సిబ్బంది వాగ్వాదంతో వెల్ఫేర్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే సిబ్బంది చూసి ఆమెను కాపాడగలిగారు. గుడిపాల మండలంలోని 189 కొత్తపల్లె సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా ఓ యువతి, వెల్ఫేర్ అసిస్టెంట్‌గా మరో మహిళ పనిచేస్తున్నారు. రెండురోజుల క్రితం డిజిటల్ అసిస్టెంట్ కంప్యూటర్ వర్క్ చేస్తుండగా వెల్ఫేర్ అసిస్టెంట్ తనకు కూడా కంప్యూటర్ వర్క్ ఉందని కంప్యూటర్ ఇవ్వాలని ఆమెను కోరారు. అయితే కంప్యూటర్ ఇవ్వడానికి కుదరదని చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం నెలకొంది. రెండురోజులుగా వీరిద్దరి మధ్య ఎక్కువగా వాగ్వాదాలు అవ్వడంతో బుధవారం వెల్ఫేర్ అసిస్టెంట్ సచివాలయంలో చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. వెంటనే సిబ్బంది చూసుకుని ఆమెను కాపాడగలిగారు. ఈ విషయాన్ని పైఅధికారులకు తెలియజేయడంతో గురువారం వచ్చి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో ప్రస్తుతానికి సమస్య సద్దుమణిగింది.

'వైఎస్సార్ పొలంబడి' పరిశీలన



పొలంబడి కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు రైతుభరోసా కేంద్ర పరిధిలో సాగుతున్న వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని అసిస్టెంట్ కలెక్టర్ మేఘస్వరూప్ బుధవారం పరిశీలించారు. గ్రామంలోని కంబిరెడ్డి పొలంలో 14 వారాల పాటు పొలంబడి కార్యక్రమాన్ని స్థానిక వ్యవసాయశాఖ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను స్థానిక ఏడీ అన్నపూర్ణ దేవి ఆయనకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్‌బాషా, ఏడీఏ మధుసూదన్‌రెడ్డి, ఆత్మా చైర్మన్ గోవిందురెడ్డి, ఆర్‌బీకే ఇన్‌చార్జ్ సింధు, రైతులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల ధ్వంసం

కుప్పం: కుప్పం సెబ్ అధికారులు వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం బాటిళ్లను ఆ శాఖ అసిస్టెంట్ ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. బుధవారం మున్సిపాలిటీ డంపింగ్ యార్డులో 2549 మద్యం బాటిళ్లను జేసీబీతో తొక్కించారు. దీంతో పాటు 134 లీటర్ల సారాను కూడా ధ్వంసం చేశారు.

ప్రజలకు చేసిన మేలుపై కరపత్ర ప్రచారం

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: సచివాలయ కన్వీనర్లు గురువారం నుంచి ఇంటింటికీ వెళ్లి 'జగనన్న నువ్వే మా నమ్మకం' స్టిక్కర్లు అతికించి కరపత్రాల ప్రచారం చేస్తారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు చేసిన మేలు, గత ప్రభుత్వ వైఫల్యాలపై సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి కరపత్రాల ద్వారా తెలియజేస్తారన్నారు. వారం రోజులు సచివాలయాల కన్వీనర్ల ఇన్‌చార్జిలు సచివాలయాల్లో సమావేశాలు నిర్వహించాలని పార్టీ ఆదేశించిందన్నారు. పార్టీ ఆదేశాల మేరకు 1–25 డివిజన్‌లోని సచివాలయాల కన్వీనర్ల ఇన్‌చార్జిగా టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగణేష్, 26–50 ఇన్‌చార్జిగా కో–ఆప్షన్ మెంబర్ కోలా కిరణ్, గుడిపాల మండలానికి సాయి, చిత్తూరు మండలానికి విశాల్‌రెడ్డిని నియమించారన్నారు. నియోజకవర్గంలో కార్పొరేషన్‌కు 2, మండలానికి ఒకరు చొప్పున సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జిలను నియమించామన్నారు. వీరు రోజూ 10 సచివాలయాల్లో స్థానిక కార్పొరేటర్, నాయకులు, కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో కలిసి సమావేశాలు నిర్వహించాలన్నారు. వీరికి పార్టీ క్యాడర్ సహకరించాలన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు జ్ఞానజగదీష్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, నాయకులు ప్రతిమారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జయంతిపై సమావేశం

స్థానిక బలిజ నాయకులతో ఎమ్మెల్యే తన నివాసంలో బుధవారం సమావేశమయ్యారు. ఈనెల 16న శ్రీకృష్ణదేవరాయల జయంతిని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమ నిర్వహణపై కమిటీని నియమిస్తామన్నారు.

సీఎం జగన్‌తో అన్ని వర్గాలకు న్యాయం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గుడిపాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల ప్రజలతో న్యాయం లభిస్తోందని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. బుధవారం గొల్లమడుగు పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. గ్రామంలో వీధి లైట్లు, సిమెంట్‌రోడ్లు, డ్రైనేజీ సమస్యలను స్థానికులు ఎమ్మెల్యేకు నివేదించారు. అన్నింటినీ త్వరలో పరిష్కరిస్తామని ఎంపీ వారికి హామీ ఇచ్చారు.

చంద్రబాబు పాలనంతా మోసాలే

టీడీపీ అధినేత చంద్రబాబు పాలనంతా అబద్ధాలు, మోసాలతో సాగిందని ఎమ్మెల్యే విమర్శించారు. 2014 ఎన్నికల సమయంలో పలు హామీలు ఇచ్చి అధికారంలో కొచ్చిన చంద్రబాబు ప్రజలను నిలువునా దగా చేశారన్నారు. ఇప్పుడు తాను మళ్లీ అధికారంలో కొస్తే ప్రజలకు మేలు చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందని, ఆయన మాటల్ని ప్రజలు విశ్వసించడం లేదన్నారు. ప్రస్తుతం సకాలంలో వర్షాలు కురవడంతో భూగర్భ జలాల మట్టం పెరిగిందని, గతంలో 700 అడుగుల్లో నీళ్లు పడని ప్రాంతాల్లో ఇప్పుడు 250 అడుగుల్లోనే నీళ్లు పడుతుండడం, అన్ని చెరువులు నిండి రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ జనార్దన్, సింగిల్ విండో చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రారెడ్డి, వరదరాజులురెడ్డి, వెంకిరెడ్డి, రజనీకాంత్, సుధాకర్‌నాయుడు, సాయి, వెంకటేష్‌రెడ్డి, రవి, శిలంబరసన్, సాయి, జయకోడి, గుణవతి, విక్టర్, చిట్టిబాబు, డానియల్, రజినీ, బాబులతో పాటు తహశీల్దార్ బాబూరాజేంద్ర ప్రసాద్, ఎంపీడీఓ ఉపేంద్ర, ఏఈలు జయచంద్రారెడ్డి, హిమంత్, గణేష్, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కరిస్తా!



కట్టకిందపల్లెలో మహిళలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

- ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హామీ

యాదమరి: దారి సమస్యను రూ.90లక్షలతో పరిష్కారనని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని కొటాల గ్రామ సచివాలయ పరిధిలోని కట్టకిందపల్లె, కొటాల దళితవాడలో బుధవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, లేదా? అని ఆరా తీశారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

ఎన్నో ఏళ్లుగా తమ గ్రామానికి దారి లేదని, గతంలో ఎందరో నాయకులు, అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకున్న పాపానపోలేదని కట్టకిందపల్లె వాసులు ఎమ్మెల్యేకు తమ గోడు నివేదించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. సంబంధిత అధికారులు, సర్పంచ్‌తో మాట్లాడారు. గ్రామానికి వెళ్లాలంటే పట్టా భూమిలో వెళ్తున్నట్లు తెలుసుకున్నారు. స్థలం ఇప్పించేలా చూస్తానంటూ పైవిధంగా హామీ ఇవ్వడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, తహసీల్దార్ చిట్టిబాబు, ఎంపీడీఓ శివరాజ్, ఏఈలు జయచంద్రా రెడ్డి, నవీన్, గుర్రప్ప, వివిధ శాఖల అధికారులు, నాయకులు మనోహర్ రెడ్డి, మనోహరన్, నదియ, చిన్నబ్బరెడ్డి, దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పూతలపట్టు విద్యార్థిని



ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థి మహిత

పూతలపట్టు: తమ స్కూలు విద్యార్థిని కె.మహిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామోదరనాయుడు తెలిపారు. అడవుల నరికివేత, పెట్రోల్ వాడటం, సీఎఫ్‌సీ గ్యాస్ వినియోగం వలన కలిగే దుష్ఫలితాలను జిల్లా స్థాయి పోటీల్లో ప్రదర్శించిందని, అలాగే వీటికి పరిష్కార మార్గాలైన సౌరశక్తి వినియోగం, 4ఆర్ పద్ధతులు, మొక్కలు నాటి సంరక్షించడం..ఇత్యాది వాటిని తెలియజేసి ప్రథమ బహుమతి కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులో విద్యార్థి తల్లిదండ్రులు ప్రోత్సాహం ఎంతో ఉందని చెప్పారు. బుధవారం స్కూలులో మహితను హెచ్ఎంతోపాటు టీచర్లు అభినందించారు.

పూడికతీత పనుల పరిశీలన

తవణంపల్లె: మండలంలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని డ్వామా ఏపీడీ సుబ్రమణ్యం ఈజీఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని కర్ణంవాండ్లవూరు దగ్గర సప్లయ్ ఛానల్లో పూడికతీత పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కూలీలకు తగిన పనులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ లలిత, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లో మీడియా ఒత్తిడితో మంత్రిపై నిందలు

- ఎదురు తిరిగిన గ్రామస్తులు
- వారు చెప్పమంటే చెప్పానన్న టీడీపీనేత



మీడియాతో మాట్లాడుతున్న ఎన్ఎం బాషా

నగరి : మంత్రి ఆర్కేరోజాపై బురద జల్లాలన్న దురుద్దేశంతో ఆమె దత్తత తీసుకున్న నగరి మండలంలోని మీరాసాహెబ్ పాళెం గ్రామానికి వెళ్లిన ఎల్లో మీడియాకు అక్కడ గ్రామస్తులు ఎవరూ వారి వద్దకు రాకపోవడంతో టీడీపీ నాయకుడు ఎన్ఎం బాషా ద్వారా లేనిపోని ఆరోపణలు చేయించారు. మంత్రి దత్తత తీసుకున్న గ్రామంలో అభివృద్ధి పనులు జరగలేదని, సమస్యలు తిష్ట వేశాయంటూ ఆయన చెప్పాడు. అదే మీడియాలో ప్రసారం కావడంతో అది చూసిన గ్రామస్తులు టీడీపీ నాయకునిపై తిరగబడ్డారు. గ్రామాన్ని ఇంతగా అభివృద్ధి చేస్తుంటే ఎందుకలా చెప్పావంటూ నిలదీశారు. దీంతో పార్టీ పిచ్చిలో పడి తాను తప్పు చేశానని తెలుసుకున్న టీడీపీ నాయకుడు ఎన్ఎం బాషా మళ్లీ మీడియా ముందుకు వచ్చాడు.

వారు చెప్పిన స్క్రిప్ట్‌నే చెప్పినా..

ఎల్లో మీడియాతో తాను మాట్లాడింది సొంత మాటలు కావని వారు చెప్పిన స్క్రిప్ట్‌ను మాత్రమే తాను చెప్పానంటూ జరిగిన సంగతి బయటపెట్టాడు. వారు చెప్పిన మాటలు విన్నందుకు గ్రామంలో తన పరువు పోయిందన్నారు. తన ఇంట్లోనూ తనకు వ్యతిరేకత ఎదురైందని వాపోయాడు. గ్రామంలో 55 గృహాలను కట్టిస్తూ, 18 విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి, 8 వీధులకు సిమెంటు రోడ్లు వేస్తున్నారని, 30 వీధి దీపాలు అమర్చారన్నారు. 53 మందికి గ్రామం సమీపంలోనే ఇంటి పట్టాలు ఇప్పించారని చెప్పారు. నాడు–నేడు పథకంలో గ్రామ పాఠశాల కార్పొరేట్ స్థాయికి మారిందన్నారు. ప్రస్తుతం అంగన్ వాడీ కేంద్రం అప్‌గ్రేడ్ చేయడానికి మంజూరైందని వివరించారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

ఐరాల: పంటల సాగుకు ముందు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారిణి వరలక్ష్మి కోరారు. బుధవారం మండలంలోని వడ్రాంపల్లె ఆర్బీకేలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, భూసార పరీక్షలు చేసుకుంటే భూసారం ఎంత ఉంది? ఎలాంటి ఎరువులు వాడాలి, ఏ పంటలు సాగు చేయాలి? అనే దానిపై అవగాహన కలుగుతుందన్నారు.తద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులను సాధించవచ్చన్నారు. జింక్ లోపాలను నివారణకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు.

డెంగీ బారిన మూడేళ్ల బాలిక

- అరగొండను సందర్శించిన వైద్య అధికారుల బృందం



అరగొండలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు

తవణంపల్లె: గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా మలేరియా అధికారి ఎల్.శ్రీనివాసులు కోరారు. మండలంలోని అరగొండలో మూడేళ్ల బాలిక డెంగీ బారిన పడడంతో బుధవారం మలేరియా అధికారులు,వైద్య సిబ్బంది, పంచాయతీ అధికారులు సందర్శించారు. అరగొండలో దోమలు వ్యాప్తి చెందకుండా మందులను స్ప్రే చేయించారు. గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగు కాలువలు శుభ్రం చేయించాలని, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి రామచంద్రారెడ్డి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ పీరూ సాహెబ్, సీహెచ్ఓ వెంకటరమణ, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, అమరావతి, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, సర్పంచ్ మల్లుదొరై, పంచాయతీ కార్యదర్శి చైతన్య, ప్రశాంత్‌కుమార్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయండి



పాలేరు జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణాలపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్

బంగారుపాళెం: గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పాలేరులో జగనన్న లేఅవుట్‌ను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణాల పురోగతిని తెలుసుకున్నారు. లేఅవుట్‌లో 87 మందికి గృహాలు మంజూరయ్యాయని, వీటిలో 10 గృహాల నిర్మాణం పూర్తయ్యిందని కలెక్టర్‌కు హౌసింగ్ ఏఈ గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. బీబీఎల్‌లో–3, బీఎల్ 34, ఆర్‌ఎల్ 25, ఆర్‌సీ లెవల్‌లో 15 గృహాల పనులు సాగుతున్నాయని వివరించారు. పూర్తయిన గృహాల్లో చేరేందుకు లబ్ధిదారులు సిద్ధంగా ఉన్నారని కలెక్టర్‌కు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ, కాలనీలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారుల చేత సకాలంలో పనులు పూర్తి చేయించేలా కృషి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పనలో మండల స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జేసీ వెంకటేశ్వర్, పలమనేరు ఆర్డీఓ శివయ్య. తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీఓ హరిప్రసాద్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

జగనన్న లేఅవుట్ పరిశీలన

పూతలపట్టు: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ గౌరి కోరారు. బుధవారం మండలంలో వడ్డేపల్లెలోని జగన్నన లేఅవుట్‌ను ఆమె పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల పనులు సకాలంలో పూర్తి చేస్తే బిల్లులు ఖాతాలోకి జమ చేస్తారన్నారు.ఇళ్లను పూర్తి చేయించే బాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్ల మీద ఉందన్నారు. కార్యక్రమంలో జేఈ పరమేశ్వర్, పీఎస్ మంజునాథ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి



అనుప్పల్లె లేఅవుట్‌లో పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: నిర్దేశిత గడువులోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించడానికి సమన్వయంతో కృషి చేయాలని నగర కమిషనర్ జె.అరుణ ఆదేశించారు. బుధవారం ఉదయం కమిషనర్ అనుప్పల్లె జగనన్న లేఅవుట్‌లో పర్యటించారు. ఇళ్ల నిర్మాణాలు ఏయే దశల్లో ఉన్నాయి? మార్చి 15 నాటికి పూర్తి చేయాల్సిన నిర్మాణాలపై అమినిటీ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులతో మాట్లాడారు. బీఎల్ స్టేజిలో ఉన్న నిర్మాణాలను లబ్ధిదారులు, మేస్త్రీలను సమన్వయం చేసుకుని వేగవంతం చేయించాలన్నారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీధర్, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



ఇంగ్లిష్ ల్యాబ్ ప్రారంభ కార్యక్రమంలో ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి, టీచర్లు

ఐరాల: ఉపాధ్యాయులు విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు సులభ పద్ధతిలో అర్థమయ్యేలా టీచర్లు విద్యాబోధన చేయాలన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో పోషకాలతో కూడిన ఆహారాన్ని మెనూ ప్రకారం విద్యార్థులకు పెట్టాలని, దీనిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో ఆరు పేపర్ల బ్లూ ప్రింట్స్ ఆధారంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు నిర్వహించిన ఎస్ఏ-1 పరీక్షలపై ఆరా తీశారు. అనంతరం పాఠశాలలో ఇంగ్లిష్ ల్యాబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో అన్ని రకాల రక్త పరీక్షలు

- జిల్లా క్షయ నివారణ అధికారి రవిరాజు ఆదేశం



ప్రభుత్వాసుపత్రిలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న జిల్లా క్షయ నివారణ అధికారి రవిరాజు

యాదమరి: ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు అన్ని రకాల రక్త పరీక్షలు చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి రవిరాజు ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం ఆయన స్థానిక ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేశారు. ల్యాబ్‌లో చేస్తున్న రక్త పరీక్షలను పరిశీలించి, పైవిధంగా ఆదేశించారు. ప్రధానంగా క్షయ నిర్ధారణకు రోగులు చిత్తూరు ఆసుపత్రికి రావాల్సిన అవసరం లేదని, మండల స్థాయిలో ఉన్న ఆసుపత్రుల్లో పరీక్షలు చేయాలన్నారు. అలాగే ఐఎల్ఆర్‌లను పరిశీలించారు. మండలంలో వ్యాధి నిరోధక టీకాలను వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సునీల్ కుమార్ నాయక్, సీహెచ్ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ఎఎస్ఎన్ ప్రసాద్

చిత్తూరు అగ్రికల్చర్: ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని సప్తగిరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ అన్నారు. బుధవారం సప్తగిరి బ్యాంకు, ఆనందిరాఠి ఇన్సూరెన్స్ బ్రోకర్స్, ఎండీ ఇండియా హెల్త్ ఇన్సూరెన్స్ సంయుక్తంగా స్థానిక గ్రామీణ బ్యాంకు ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఖాతాదారులతో పాటు ప్రజలకు ఈసీజీ, రక్త, కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బ్యాంకు చైర్మన్ మాట్లాడుతూ, బ్యాంకు పరంగా ఉచిత వైద్య శిబిరాలను త్వరలో ప్రాంతీయ కార్యాలయాలు, వివిధ శాఖల్లో నిర్వహిస్తామన్నారు. ఖాతాదారులు, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రవిశంకర్, వినీత్ సింగ్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి వెళ్లి పెన్షన్ పంపిణీ



ఆసుపత్రిలో జయకు పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ కవిత

బంగారుపాళెం: బంగారుపాళెం దళితవాడకు చెందిన జయ అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు తిరుపతిలో రుయా ఆసుపత్రిలో చేర్పించారు. ఇది తెలుసుకున్న బంగారుపాళెం-2 సచివాలయం పరిధిలో పనిచేస్తున్న వలంటీర్ కవిత తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేసింది. దీనిపై వృద్ధుడు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపాడు.

వేలూరు వెళ్లి..



పూతలపట్టు : లబ్ధిదారునికి ఫించన్ ఇస్తున్న వలంటీర్ జ్యోత్స్న

పూతలపట్టు: మండలంలోని ఆకనంబట్టుకు చెందిన రఘు రామనాయుడు అనారోగ్యంతో వేలూరు కరిగిరి హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. ఇది తెలుసుకున్న వలంటీర్ జ్యోత్స్న బుధవారం కరిగిరి ఆసుపత్రికి వెళ్లి అతడికి ఫించన్ రూ.2750 అందజేసింది.